క్లుప్తంగా

నేడు పరిశుభ్రతపై ర్యాలీ

పులివెందుల టౌన్ : పట్టణంలో శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఆధ్వర్యంలో వర్షాకాల పరిశుభ్రత ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. ఈ కార్యక్రమాలలో రాజకీయ, సేవా సంస్థల, పుర ప్రముఖులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అలాగే వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించాలని మున్సిపల్ కమిషనర్ నిర్వాహకులకు సూచించారు.

ప్రభుత్వ విద్యార్థులకు మెటీరియల్ అందజేత

తొండూరు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్ కోసం టెస్ట్ మెటీరియల్‌ను పులివెందుల పట్టణానికి చెందిన దాత రాచమల్లు సునీల్‌కుమార్‌రెడ్డి అందజేశారు. హెడ్మాస్టర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు దాతలు ఇచ్చిన మెటీరియల్‌ను బాగా చదివి స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావాలన్నారు. అనంతరం ఆయన దాతను సత్కరించారు.

అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తొలగించొద్దు

తొండూరు : రీ వెరిఫికేషన్ పేరుతో అర్హులైన దివ్యాంగుల పింఛన్లను కూటమి ప్రభుత్వం తొలగించొద్దని సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకటరాములు కోరారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అన్ని రకాల దివ్యాంగుల సదరం సర్టిఫికెట్లను ఈ ఏడాది జనవరి నుంచి రీ వెరిఫికేషన్ చేస్తున్న అధికార యంత్రాంగం ఈనెల 10వ తేదీ నుంచి సచివాలయ పరిధిలో ఉన్న దివ్యాంగులందరికీ కొత్త సదరం సర్టిఫికెట్లు ఇచ్చారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,08,000 మంది పింఛన్లను తొలగించారన్నారు. మంచంపైన ఉన్న వికలాంగుల పింఛన్లను కూడా తొలగించారన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

జమ్మలమడుగు : పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరు వినాయకుడి మట్టి విగ్రహాలు వాడుదామని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. శుక్రవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసి పర్యావరణాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో కరపత్రాలను విడుదల చేశారు. తాగునీరు సురక్షితంగా ఉండాలంటే మట్టి వినాయకుల విగ్రహాలను ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, మున్సిపల్ కార్యాలయాధికారి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

జమ్మలమడుగు : జమ్మలమడుగు, మైలవరం, ఎర్రగుంట్ల మండలాల్లోని ప్రభుత్వ ఐటీఐలో ఖాళీగా ఉన్న సీట్లకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నవరూప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మొదటి, రెండవ విడతల్లో మిగిలిపోయిన ఎలక్ట్రీషన్, ఫిట్టర్, సివిల్, మెకానికల్ డ్రైవర్, కంప్యూటర్ ఓపెనింగ్ ప్రోగ్రాం అసోసియేట్ ట్రేడ్‌లలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. విద్యార్థులు పదవ తరగతి మార్కుల జాబితా, టీసీ, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, ఫొటోలు, ఫోన్ నంబర్‌లతో ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 9912946371 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలను తెలుసుకోవచ్చు అని తెలిపారు.

వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి

కమలాపురం : సర్కిల్ పరిధిలో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసే వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. వినాయక చవితి పండుగను కులమతాలకు అతీతంగా కలసి మెలసి జరుపుకోవాలన్నారు. కమిటీ సభ్యులు పోలీస్, విద్యుత్ తదితర శాఖల నుంచి అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు. ఏవరైన నిబంధనలు అతిక్రమించి అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండప పరిసరాల్లో, అలాగే నిమజ్జన ప్రాంతాల్లో చిన్న పిల్లలను దగ్గరకు తీసుకెళ్లరాదన్నారు.

ఓట్లపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదు

వేంపల్లె : అధికార టీడీపీ నాయకులకు ఓట్లపై ఉన్న శ్రద్ధ.. అభివృద్ధిపై లేకపోవడం దురదృష్టకరమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ధృవకుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉన్న ఎంపీడీఓ కుళ్లాయమ్మను ఆయన కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జమ్మలమడుగు రూరల్ : మండలంలోని ధర్మాపురం గ్రామానికి చెందిన వేణుగోపాల్‌రెడ్డి 20వ తేదీ తన ఇంటికి మరమ్మతులు చేస్తుండగా మిద్దె పైనుంచి పడి తీవ్రంగా గాయపడ్డారు. ఇతనిని చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

టమాట సాగుపై రైతుల దృష్టి

- నియోజకవర్గంలో 3 వేల ఎకరాల్లో సాగు
- ఎకరాకు రూ.60 వేలు పెట్టుబడులు
- 20 టన్నులకుపైనే దిగుబడులు


కొత్తపల్లె వద్ద సాగులో ఉన్న తీగ టమాట


పంటకు మందు కొడుతున్న రైతు

వేముల : ఈ ఏడాది టమాట సాగుపై రైతులు దృష్టి సారించారు. మార్కెట్ ధరలు ఎప్పుడు ఉంటాయి, ఎప్పుడు సాగు చేయాలి, ఎప్పుడు కోతలు కోయాలనే ఆలోచనతో రైతులు సాగు చేస్తున్నారు. ఈ సీజన్‌లో ధరలు ఉంటాయని ఆ సమయానికి దిగుబడులు అందాలనే ఉద్దేశ్యంతో సాగుకు సిద్ధమవుతున్నారు. అయినా సాగులో ఒకోక్కసారి నష్టాలు తప్పడంలేదు.

నియోజకవర్గంలో 3వేల ఎకరాలకుపైనే సాగు

నియోజకవర్గంలో టమాట సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. ఈ ఏడాది 3255 ఎకరాలలో టమాటను రైతులు సాగు చేసుకున్నట్లు ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. బయట ప్రాంతాల్లోని నర్సరీలలో మొక్కలు తెచ్చుకుని సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా సాహు, యూఎస్‌పీ 440 అనే రకాలను సాగు చేస్తారు. ఒక్క మొక్క 60 పైసల నుంచి ఒక రూపాయికి కొనుగోలు చేసి రైతులు తెచ్చుకుంటున్నారు. ఈ ఏడాది మే చివరి వారంలోనూ, జూన్ మొదటి వారంలోనూ రైతులు టమోట సాగు చేశారు. ప్రస్తుతం పంట పూత, కాయ దశలో ఉంది. కొన్ని ప్రాంతాలలో తీగ టమాటను సాగు చసిన రైతులు కర్రలకు దారం సహాయంతో కట్టి కాయలు నేలకు తగలకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

తెగుళ్లు సోకకుండా సస్యరక్షణకు ప్రత్యేక చర్యలు

వీటి సాగులో తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుంది. పంట సాగు చేశాక సస్యరక్షణకు రైతులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఒకసారి పంటకు తెగుళ్లు సోకితే నివారణకు చాలా కష్టపడాలి. దీంతోనే రైతులు పంటకు తెగుళ్లు సోకకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. టమాటలో ఎక్కువగా ఆకు మాడు తెగులు, కాయ తొలుచు పురుగు సోకుతుంది. ఈ తెగుళ్లు దరి చేరకుండా వారానికొకసారి మందులను పిచికారి చేస్తున్నారు.

ఎకరాకు రూ.60 వేలకుపైనే పెట్టుబడులు

టమోట నాటిన మొదలు దిగుబడులు అందేవరకు ఎకరాకు రూ.60 వేలకుపైనే పెట్టుబడులు పెడుతున్నారు. పంట కాలం 150 రోజులు. సాగు వేశాక పంటలో కలుపు తీయడం, తెగుళ్లకు మందులు పిచికారి చేయడంతో అదనంగా ఖర్చులు అవుతున్నాయని రైతులు అంటున్నారు.

ఎకరాకు 20 టన్నులకుపైనే దిగుబడులు

సాగులో ఎకరాకు 20 టన్నులకుపైనే దిగుబడులు వస్తాయని రైతులు అంటున్నారు. 70 రోజుల నుంచే దిగుబడులు అందుతాయి. ఇలా తోటలలో 7 నుంచి 8 కోతలు తీయవచ్చునని రైతులు చెబుతున్నారు. పంటను ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా దిగుబడులు ఉండవు. ప్రతి ఏడాది ఒకే రకమైన పంట సాగు చేయడం ద్వారా దిగుబడులు తగ్గి నష్టపోతున్నారు. రైతులకు స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు టమాటలను రవాణా చేస్తారు. పులివెందుల నుంచి రైతులు చెన్నై, మదనపల్లె తదితర మార్కెట్లకు తరలిస్తారు. మార్కెట్ ధరలు ఉంటే రవాణా ఖర్చులు అవుతున్నా ఆదాయం ఉంటుంది.

ధరలు ఉంటాయనే టమోట సాగు చేశా



ఈ ఏడాది టమాట ధరలు ఉంటాయనే ఆశతో సాగు చేశా. సాగులో పెట్టుబడులు పెరిగిపోయాయి. టమాట నాటిన మొదలు దిగుబడులు అందేవరకు పంటను జాగ్రత్తగా కాపాడుకోవాలి. తెగుళ్లు సోకకుండా జాగ్రత్త తీసుకోవాలి. దిగుబడులు అందే సమయానికి మార్కెట్ ధరలు లేకపోతే తీవ్రంగా నష్టపోతాం

– నాగిరెడ్డి, టమోట రైతు, వేల్పుల

ధరలు ఉంటాయో లేదో చెప్పలేని పరిస్థితి



టమాట సాగు ఖర్చుతో కూడుకున్నది. దిగుబడులు అందే నాటికి మార్కెట్ ధరలు ఎలా ఉంటాయో చెప్పలేని పరిస్థితి. ధరలు ఆశాజనకంగా ఉన్నట్లయితే రైతులకు ఆదాయం ఉంటుంది. మార్కెట్ ధరలు లేకపోతే సాగులో రైతులు తీవ్రంగా నష్టపోతారు. మార్కెట్ సమాచారం ఆధారంగా రైతులు పంటను వేసి ఒకోక్కసారి ధరలు లేక నష్టపోతున్నారు.

– రాఘవేంద్రారెడ్డి, హెచ్ఓ, పులివెందుల

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

– ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అలాగే ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణురాలు డాక్టర్ నిహారిక క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్, క్యాన్సర్ రోగులను క్రమం తప్పకుండా అనుసరించడం, ఇతర క్యాన్సర్ సంబంధిత సంప్రదింపులు అందుబాటులో ఉంటాయన్నారు. అలాగే ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. పరీక్ష చేయించుకోవాలనుకునే వారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. ఆసుపత్రిలో నూతనంగా డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందని, కిడ్నీ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ముద్దనూరు : ముద్దనూరులో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం వుంటుందని ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. జాతీయ రహదారి పనుల్లో భాగంగా విద్యుత్ లైన్ల ఏర్పాటుకు నేటి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ముద్దనూరులో మాత్రమే విద్యుత్ సరఫరా వుండదని వినియోగదారులు గమనించాలని ఏఈ కోరారు.

ఎరువులు విక్రయించిన నగదు స్వాహా

కమలాపురం : మండలంలోని ఎల్లారెడ్డిపల్లె సచివాలయం పరిధిలోని వ్యవసాయ సిబ్బంది చేతి వాటం ప్రదర్శించి ఎరువులు విక్రయించి నగదును స్వాహా చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, అధికారుల సమాచారం మేరకు ఎల్లారెడ్డిపల్లె సచివాయలంలో ఎంపీఈఓగా పనిచేస్తున్న బాబు అనే ఉద్యోగి నాలుగు నెలల క్రితం ఆర్ఎస్‌కేకు వచ్చిన 19.98 మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులకు విక్రయించాడు. ఎరువులు విక్రయించగా వచ్చిన ఆ సొమ్మును ప్రభుత్వ ఖాతాలో కొంత మేరకు జమ చేశాడు. మిగిలిన దాదాపు రూ.1.20 లక్షల మేరకు సొంత అవసరాలకు వాడుకున్నాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం పై ఏఓ సరస్వతిని వివరణ కోరగా ఎంపీఈఓ బాబు ఎరువులు విక్రయించిన నగదును ప్రభుత్వ ఖాతాలో జమ చేయని విషయం వాస్తవమేనన్నారు. ఇప్పటికే తాము పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించామన్నారు. అతను ఆన్‌లైన్‌లో నగదు జమ చేసి సీబేడ్ తీసుకోవాలని, లేని పక్షంలో అతని జీతం నుంచి రికవరి చేస్తామని ఆమె తెలిపారు.

మాదక ద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రెసిడెన్షియల్ మెడికలాఫీసర్ డాక్టర్ నవీన్

పులివెందుల : మాదక ద్రవ్యాలు, సామాజిక మాధ్యమాలపట్ల బాలికలు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని ప్రొబెషనరీ ఎస్ఐ అనీల్‌కుమార్ పిలుపునిచ్చారు. అహోబిలాపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(మెయిన్)లో స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొబెషనరీ ఎస్ఐ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువత మత్తు బారిన పడుతూ ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. బాలికలు, మహిళలు వయసుతో సంబంధం లేకుండా సామాజిక మాధ్యమాలకు బానిస కావడం సైబర్ నేరస్థుల చేతిలో చిక్కుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రెసిడెన్షియల్ మెడికలాఫీసర్ డాక్టర్ నవీన్ మాట్లాడుతూ నేటి యువత మత్తు పదార్థాలు వాడకం హీరోయిజంతో మొదలై ఆరోగ్యం దెబ్బతినడం, కుటుంబ సభ్యులకు భారంగా మారడం, ఆర్థికంగా బలహీనం కావడంతోపాటు సమాజంలో పూర్తి గౌరవాన్ని కోల్పోతున్నారన్నారు. భవిష్యత్ తరాలకు ఆదర్శంగా ఉండాల్సిన కొంతమంది యువత చరిత్ర హీనులుగా మిగిలి పోతున్నారన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సేవాసమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అనధికార లే అవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలి

పులివెందుల టౌన్ : అనధికార లే అవుట్లు, ప్లాట్లను లే అవుట్ల పథకం ద్వారా క్రమబద్ధీకరణ చేసుకోవచ్చునని మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో లే అవుట్ల యజమానులు, డెవలపర్స్, ఎల్‌టీపీలకు ఎల్ఆర్ఎస్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 2025 జూన్ 30 నాటికి కనీసం ఒక్క ప్లాట్ అయిన లే అవుట్‌లో రిజిస్టర్ అయినా ఆ లేఅవుట్ క్రమబద్ధీకరణకు అర్హత అవుతుందన్నారు. ఈ పథకంలో క్రమబద్ధీకరించుకున్న ప్లాట్లకు 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జీలలో 50 శాతం రాయితీ ఉంటుందని, అపరాధ రుసుము 45 రోజుల్లో చెల్లిస్తే 10 శాతం రాయితీ, 46 రోజుల నుంచి 90 రోజుల్లో చెల్లిస్తే 5 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఈ పథకంలో క్రమబద్ధీకరించుకోని ప్లాట్లకు భవిష్యత్‌లో భవన నిర్మాణ అనుమతులు, మున్సిపాలిటీ నుంచి ఎటువంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయబడవన్నారు. సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో నిషిద్ధ జాబితాలోకి ఈ అనధికార లే అవుట్లను చేరుస్తారన్నారు. కార్యక్రమంలో ప్రణాళిక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గాజుల అలంకారంలో వాసవీమాత


మహిళా మండలి అధ్యక్షురాలు బి.భాగేశ్వరమ్మ,

వేంపల్లె : స్థానిక మెయిన్ బజార్‌లో ఉన్న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శుక్రవారం వాసవీ మాత గాజుల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు ప్రసాద్‌శర్మ అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం, మహా మంగళహారతి తదితర విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తి అమ్మవారిని ముత్యపు కవచంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి అమ్మవారికి ప్రాకారోత్సవం నిర్వహించారు. అలాగే మహిళలు కుంకుమ పూజ, అష్టోత్తరం, లక్ష్మీ అష్టోత్తరం పఠించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు బి.భాగేశ్వరమ్మ, ఆలయ నిర్వాహకులు మిట్టా మోహన్‌రావు, ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీవాసవీ కళ్యాణ మండపం, మహిళా మండలి కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి చికిత్స శిబిరం ప్రారంభం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, డాక్టర్ రవీంద్రారెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : స్థానిక జయమ్మ కాలనీలో ఉన్న వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో కంభం తిరుపాల్‌రెడ్డి, ధర్మపత్ని రామలక్షుమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు, చెన్నై శంకర్ నేత్రాలయ కంటి వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత చికిత్స శిబిరాన్ని శుక్రవారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, తదితరులు ప్రారంభించి మాట్లాడారు. కంటి శుక్లాం ఆపరేషన్ చేయించుకున్న వారికి అద్దాలు, మందులు, కాటన్ ఉచితంగా ఇస్తారన్నారు. కంటి చికిత్స చేసిన 2 గంటల్లోనే ఇంటికి పంపిస్తారన్నారు. ఈ కంటి ఆపరేషన్‌కు ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. అక్కడికి వచ్చిన వారికి ఉచిత భోజన సదుపాయం కల్పిస్తారన్నారు. కంటి చికిత్సకు వచ్చేవారు ఆధార్ కార్డు, సెల్ ఫోన్ నెంబరు తప్పనిసరిగా తీసుకుని రావాలన్నారు. ఈ కంటి పరీక్షలు 22వ తేదీ నుండి 28వ తేదీ వరకు ఉంటుందన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పులివెందుల నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తులసమ్మ ఆసుపత్రి చిన్నపిల్లల డాక్టర్ రవీంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర్‌రెడ్డి, రవిశంకర్‌లు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి, జ్యోతి ప్రజ్వలన చేశారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రను విజయవంతం చేయండి

కమలాపురం : ప్రతి నెలా 4వ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమలాపురం నగర పంచాయతీ కమిషనర్ ప్రహ్లాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక తన కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి నెలా 4వ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి మీ పరిధిలోని ప్రజా ప్రతినిధులను, వార్డు కౌన్సిలర్లను, మెప్మా సభ్యులను ఆహ్వానించాలన్నారు. కార్యక్రమం విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ

జమ్మలమడుగు : ముద్దనూరు రోడ్డులో ఉన్న పాలిటెక్నికల్ కాలేజీలో మహిళలకు ఉచితంగా ఆటోమొబైల్ రంగంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ విజయభాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాల్మియా భారత్ ఫౌండేషన్, రెడ్‌కార్పెట్ లెర్నింగ్ ఇన్స్టిట్యూట్ సంయుక్తంగా ఈ ప్రాజెక్టును ప్రారంభించామన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా మహిళలకు టూవీలర్ టెక్నీషియన్లుగా తీర్చిదిద్దడంతోపాటు ఆటో మొబైల్ రంగంలో మహిళలకు సాంకేతిక పరిజ్ఞానం అందించి ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యమన్నారు. శిక్షణ కాలం మూడు నెలలు ఉంటుందని కనీసం పదవ తరగతి ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు ఉండాలని సూచించారు. అర్హులైన వారు నెరుగా పాలిటెక్నికల్ కాలేజి వద్దకు వచ్చి లేదా 9502609641 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.

ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు

జమ్మలమడుగు రూరల్ : మండలంలో నిర్వహించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనుల్లో భారీగా అవకతవకలు జరిగాయి. మండలంలో కూలీలకు పనులు చూపించడం అటుంచితే కేవలం నాయకుల సంపాదన కోసమే మెటీరియల్ కాంపోండెంట్ ద్వారా పనులు చేసినట్లు అర్థమవుతుంది. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో 2024- 2025 సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన పనులపై ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాజెక్ డైరెక్టర్ ఆదిశేషారెడ్డి గ్రామాల వారిగా సోషియల్ అడిట్ బృందం చేసినట్లు వివరించారు. ఈ సందర్బంగా మండలంలో మొత్తం రూ. 8 కోట్ల 92 లక్షలు పనులు చేసినట్లు ఆయన తెలిపారు. తనిఖీలో అడిట్ బృందం వివిధ గ్రామాల్లో వేరు వేరు పనులలో భాగంగా రూ.64 వేల 240 రూపాయలు దుర్వినియోగం జరిగినట్లు ఆయన తెలిపారు. అనవసరంగా ఖర్చు చేసిన డబ్బును తిరిగి రికవరి చేస్తామన్నారు. అంతకు మునుపు అయా గ్రామాలకు సంబంధించి డిఆర్‌పిలను పిలచి గ్రామాలకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ తప్పుల గురించి బహిరంగంగా చర్చించారు. కార్యక్రమంలో ఏపీడీ శివలింగారెడ్డి, డీవీడీ జుబేదాబేగం, ఎస్టీఎం లోకేశ్వర్ రెడ్డి, ఏపీఓ పద్మారాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు చివరి శ్రావణ శనివారోత్సవం


గండి అంజన్న

చక్రాయపేట : గండిలో నేడు శ్రావణ మాసం చివరి శనివారోత్సవం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో వస్తారని వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపట్టినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజ, పాలక మండలి సభ్యులు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దాతలచే పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. కడప రిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు ట్రిపుల్‌ఐటీకి చెందిన ప్రసాద్ తెలిపారు. చక్రాయపేట ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారిణి వాణి తెలిపారు. శనివారం రాత్రి జరిగే క్షేత్రోత్సవం ఆస్థానంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ఉప ప్రధాన అర్చకుడు రాజారమేష్ తెలిపారు. ఉదయం 3 గంటలకు సుప్రభాతం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉదయం 4 గంటల నుంచి భక్తులకు సర్వ దర్శనం కల్పిస్తామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు ఆర్కేవ్యాలీ సీఐ ఉలసయ్య, ఎస్ఐ రంగారావులు తెలిపారు. వాహనాలను గండిలోకి అనుమతించమని ప్రజలు సహకరించాలని వారు కోరారు. వృద్ధులు, మహిళల కోసం అద్దాలమర్రి క్రాస్ ఇడుపులపాయ క్రాస్ వద్ద నుంచి గండిలోకి ప్రైవేట్ పాఠశాలల బస్సులను ఉచితంగా తిప్పుతున్నట్లు వారు తెలిపారు. వీఐపీ పాసులు పొందిన వారికి ఉదయం 5 నుంచి 8 వరకు, సాయంత్రం 5 నుంచి 8 గంటల లోపు మాత్రమే స్వామి దర్శనానికి అనుమతి ఇస్తామన్నారు.

టీబీ రహిత సమాజం నిర్మించుకుందాం


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

జమ్మలమడుగు : టీబీ రహిత సమాజం నిర్మించుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని టీబీ సినియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ రవిశంకర్ తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజిలో ప్రిన్సిపాల్ నరేష్ ఆధ్వర్యంలో టీబీ ముక్తి భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ అనేది టీబీ వ్యాధిగ్రస్తులు తుమ్మినప్పుడు వారి తుంపరలు ఇతరులపై పడినప్పుడు ఒకరి నుంచి మరోకరికి సంక్రమిస్తుందన్నారు. ఎక్కువ రోజులు జ్వరం రావడం తోపాటు దగ్గు తగ్గకపోవడం, బరువు తగ్గిపోతే వెంటనే గళ్ల పరీక్షలు చేయించుకోవాలన్నారు. గనుల్లో, సిమెంట్ ఫ్యాక్టరీలలో పనిచేసే కార్మికులు నోటికి మాస్కులు ధరించడంతోపాటు చేతులను బాగా శుభ్రం చేసుకోవాలన్నారు. వ్యాధి సోకిన వారికి ఆరునెలల్లో బాగుచేసుకోవచ్చు అని తెలిపారు. టీబీ సోకిన వారికి ఉచితంగా మందులు ఇవ్వడం తోపాటు వారికి పౌష్టికాహారం కోసం ప్రభుత్వం నెలకు రూ.1000 ఆరునెలల వరకు ఉచితంగా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ కో ఆర్డినేటర్ నీలకంఠారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం.. పుణ్యకార్యం


అన్నదానం ప్రారంభిస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కమలాపురం : దానాలలో కెల్లా అన్నదానం గొప్పదని, అన్నదానం చేయడం ఒక పుణ్యకార్యంతో సమానం అని హార్టికల్చర్ స్టేట్ ఎక్స్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రామ సేవకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ఆసుపత్రికి వచ్చిన రోగులకు ఆయన వడ్డించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం మధ్యాహ్నం ఆసుపత్రి వద్ద అన్నదానం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రోగులు, పేద ప్రజలకు ఈ అన్నదాన కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రామ సేవకులు ముందుకు వచ్చి పేద ప్రజల ఆకలి తీర్చడం హర్షణీయం అన్నారు. కాగా ఈ కార్యక్రమానికి దాతగా నిలిచిన రామ సేవకులు కామిశెట్టి వెంకటేశ్వర్లు దంపతులను ఆయన అభినందించారు.

బాలల హక్కుల పరిరక్షణ మన బాధ్యత


పులివెందులలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాబున్ని

పులివెందుల రూరల్ : బాలల హక్కుల పరిరక్షణ మన బాధ్యత అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాబున్ని తెలిపారు. శుక్రవారం నల్లపురెడ్డిపల్లెలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1098 చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు అరికట్టేందుకు తమ వంతు కృషి చేయాలన్నారు. 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నెంబర్‌కు విస్తృతంగా ప్రచారం కల్పించాలన్నారు. బాలికలపై అత్యాచారాలు జరిగినా, కిడ్నాప్‌లు జరిగినా, బాలికలను వేధిస్తున్నా వెంటనే 1098 అనే టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మహిళా సంరక్షణ కార్యదర్శి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు 1098 అనే చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి 1098 అనే టోల్ ఫ్రీ నెంబర్ గురించి, దాన్ని ఏ సందర్భంలో ఉపయోగించాలి వంటి విషయాలను గురించి అవగాహన కల్పించారు. అలాగే స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో లింగాల మహిళా పోలీసు గురుప్రవీణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : పిల్లల భద్రత కోసం, ప్రమాదాల నుంచి రక్షణకు 1098 అనే చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ ఏర్పాటు చేయడం జరిగిందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంత తెలిపారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు 1098 చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడ ఉన్నా, ఎలాంటి ఫోన్ నుండైనా ఉచితంగా 1098 అనే నెంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బోధన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : బాలల హక్కుల పరిరక్షణ మనందరి బాధ్యత అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డాక్టర్ స్వర్ణలత పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పాములూరు గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా పిల్లలు లైంగిక వేధింపులకు గురైనా, మత్తు పదార్థాలకు బానిసైనా, పిల్లలు ఎవరైనా ప్రమాదంలో ఉన్నా, అనాథ పిల్లలుగా ఎవరైనా గుర్తించి ఉన్న 1098కు సమాచారమివ్వాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభద్రమ్మ, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.